## క్లుప్తంగా

### విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సరుబుజ్జిలి: స్థానిక 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించడం కోసం గురువారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్థానిక పోలీస్‌స్టేషన్, వెన్నెలవలస, నందికొండ, సరుబుజ్జిలి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ ఎస్.బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఫీడర్ పరిధిలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

### వినియోగంలోకి అంగన్‌వాడీ భవనం


భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సరుబుజ్జిలి: మండలంలోని సుబ్బపేట గ్రామంలో అంగన్‌వాడీ నూతన భవనం వినియోగించక ప్రైవేటు వ్యక్తుల అధీనంలో ఉండడంతో, నిరుపయోగంగా అంగన్‌వాడీ భవనం శీర్షికతో సాక్షి దిన పత్రికలో ఇటీవల కథనం ప్రచురితమైంది. దీంతో బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి గీత స్పందించారు. ఈ మేరకు సూపర్‌వైజర్ జానకితో కలిసి భవనాన్ని బుధవారం పరిశీలించారు. అందులో ఉన్న ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన వస్తువులు తొలగించి, భవనాన్ని వినియోగంలోకి తెచ్చారు.

### 'రికార్డులు సక్రమంగా నిర్వహించాలి'


రికార్డులను పరిశీలిస్తున్న కరుణాకరరావు

పాతపట్నం: గ్రామ సచివాలయాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మంచు కరుణాకరరావు సూచించారు. మండలంలోని తిడ్డిమి గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలోని హాజరు, రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ రైతులకు అందుబాటులో ఉండాలని, విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ ఎస్.పాపారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### మజ్జి గౌరమ్మకు ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలోని మజ్జి గౌరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించారు. బంగారమ్మ తల్లి పెద్ద పండగల్లో భాగంగా మండల కేంద్రంతో పాటు లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. ఈనెల 28వ తేదీ వరకు బంగారమ్మ తల్లి పెద్ద పండగలు నిర్వహించడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలియజేశారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం


ఆలయ నిర్వాహకులతో పూర్వ విద్యార్థులు

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989–1990 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పులిపుట్టి వద్ద కన్నెధార కొండ మీద నిర్మించిన రామాలయ రోడ్డు నిర్మాణానికి రూ.64,400ల విరాళాన్ని బుధవారం అందజేశారు. రామాలయం రోడ్డు బాగులేకపోవడంతో భక్తులు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నందున, స్పందించిన విద్యార్థులు బీటీ రోడ్డు వేసేందుకు విరాళం ఇచ్చినట్లు ఆలయ నిర్వాహకుడు పిండి శ్రీనివాసరావు, సభ్యులు పడాల వెంకటకృష్ణ, సన్నిబోయిన గోపి, బోగి వెంకటరమణలు తెలియజేశారు.

### దాతల సహకారంతో శివాలయ నిర్మాణం

ఎల్.ఎన్.పేట: మండలంలోని మల్లిఖార్జునపురం వద్ద నిర్మించిన వంశధార పునరావాస కాలనీలో దాతల సహకారంతో శివాలయం నిర్మాణ పనులు చేపట్టామని కమిటీ సభ్యులు తెలిపారు. పునరావాస కాలనీకి చెందిన వంశధార నిర్వాసితులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన దాతల సహకారంతో పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మరింతమంది దాతలు సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

# దివ్యాంగ చిన్నారులపై ప్రత్యేక దృష్టి


నరసన్నపేట: సర్వే నిర్వహిస్తున్న ఐఈఆర్‌పీలు


మెళియాపుట్టి: చిన్నారులను గుర్తిస్తున్న సిబ్బంది


సారవకోట: కోదడ్డపనసలో సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: దివ్యాంగులు, ప్రత్యేక అవసరాల చిన్నారులను గుర్తించి వారికి కావాల్సిన అవసరాలను తీర్చేవిధంగా 40 రోజుల స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంఈవో దేవేంద్రరావు తెలిపారు. మెళియాపుట్టిలో జరుగుతున్న దివ్యాంగ పిల్లల నమోదు ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. 0 నుంచి 18 ఏళ్ల వయస్సు లోపల ఉన్న పిల్లలను గుర్తించి, వారి అవసరాలు తీర్చడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. వారికి అనుగుణంగా చదువులో రాణించేలా చేస్తామని తెలిపారు. 40 రోజుల పాటు నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఇప్పటి వరకు 13 మందిని గుర్తించినట్లు తెలిపారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు ఝాన్సీరాణి, శివప్రసాద్ ఉన్నారు.

నరసన్నపేట: మండలంలో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు, నమోదు కోసం సర్వే చురుకుగా జరుగుతోంది. మే 2వ తేదీ నుంచి సర్వే నిర్వహిస్తుండగా ఇప్పటివరకు 15 మంది పిల్లలను గుర్తించారు. 18 ఏళ్ల వయస్సు ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించడం, నమోదు చేయడం చేస్తున్నామని ఐఈఆర్‌పీలు శ్రీనివాసరావు, కృష్ణవేణి తెలిపారు. జూన్ 9వ తేదీ వరకు ఈ సర్వే ఉంటుందన్నారు. గుర్తించిన పిల్లలకు సమీప స్కూల్స్‌లో జాయిన్ చేస్తామని, అవసరమైన వైద్యం అందిస్తామని తెలిపారు.

సారవకోట: మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక అవసరాల పిల్లల కోసం సర్వే చేస్తున్నట్లు ఎంఈవో ఎంవీ రమణ తెలిపారు. మండలంలో మాళువ, మాకివలస, కోదడ్డపనస గ్రామాల్లో జరుగుతున్న సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుంచి ఐఈఆర్టీ సిబ్బంది ఈ సర్వే చేపడుతున్నారన్నారు. ఇప్పటివరకు 12 మంది ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. వీరికి ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో పేరు నమోదు చేయించడం, వారికి సదరన్ ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందించి పింఛన్ల కోసం దరఖాస్తు చేయించడం చేయనున్నట్లు వెల్లడించారు. ఆయనతో పాటు ఐఈఆర్టీ సిబ్బంది శ్రీసంధ్య, పూర్ణిమ ఉన్నారు.

# 'గరిష్ట వేతనం పొందాలి'


ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

నరసన్నపేట: ఉపాధి వేతనదారులు గరిష్ట వేతనం పొందేవిధంగా పనిచేయాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. మండలంలోని జమ్ము పంచాయతీ పొన్నానపేట చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం గరిష్ట వేతనం రూ.300లకు పెంచిందని, ఈ మొత్తం పొందితే గిట్టుబాటు అవుతుందన్నారు. రైతు పని, ఉపాధి పని ఒకేలా చేయాలని కోరారు. అలాగే ఎండ తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేయడం మంచిదన్నారు. అంతకుముందు స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కొలతలు సక్రమంగా ఇవ్వాలని ఆదేశించారు. ఫీల్డు అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఆయనతో పాటు ఏపీవో యుగంధర్ ఉన్నారు.

## గందరగోళంగా సర్వసభ్య సమావేశం


సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ కృష్ణారావు

కొత్తూరు: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గందరగోళం మధ్య ముగిసింది. వేదిక మీదకు ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను ఎంపీపీ ఆహ్వానిస్తున్న సమయంలో గందరగోళం నెలకొంది. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకొని, తోపులాటకు దారితీసింది. ఇరువర్గాల సభ్యుల మధ్య పరిస్థితి మరింత ఉద్రుతి కావడంతో ఎంపీడీవో త్రివిక్రమరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఎంఏ అహ్మద్ తన సిబ్బందితో సమావేశం వద్దకు చేరుకోవడంతో వివాదం సద్దుమణిగింది. అయితే ఎన్నికలు కోడ్ అమల్లో ఉండడంతో సమావేశంలో సభ్యులు సంతకాలు తీసుకోవడం మాత్రమే జరిగిందని, తీర్మానాలు చేయలేదని ఎంపీడీవో తెలియజేశారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పగడ్బందీ ఏర్పాట్లు


పీఈఎస్ పట్నాయక్

హిరమండలం: ఈనెల 24వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు పగడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీఈఎస్ పట్నాయక్ తెలియజేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు శ్రీరామ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ కేంద్రాల్లో హిరమండలం, ఎల్ఎన్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు, కేజీబీవీ విద్యార్థులు, శ్రీరామ, కార్మెల్ ప్రైవేటు కళాశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. పరీక్షలను జూన్ 1వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయన్నారు. విద్యార్థులు వారికి కేటాయించిన కేంద్రానికి అరగంట ముందుగా చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు.

## కుంటిభద్రలో కార్డన్ సెర్చ్

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర గ్రామంలో సీఐ ఆర్.వేణుగోపాలరావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కార్డన్ సెర్చ్ బుధవారం నిర్వహించారు. గ్రామంలో వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్ పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కొత్తూరు ఎస్‌ఐ ఎంఏ అహ్మద్ పాల్గొన్నారు.

### 'నాణ్యతా ప్రమాణాలు పాటించాలి'


మస్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

కొత్తూరు: ఉపాధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో పి.త్రివిక్రమరావు సూచించారు. మండలంలోని అంబన్నగూడ గిరిజన గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. నిర్దేశించిన కొలతలు ప్రకారం పనులు చేసినట్లయితే రోజుకు రూ.300 వేతనం వస్తుందన్నారు.

### ఉచిత నేత్ర వైద్య శిబిరం


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 97 మందికి స్థానిక సీహెచ్‌సీకి చెందిన ఆప్తాలమిక్ ఇప్పిలి జానకిరామయ్య కంటి పరీక్షలు నిర్వహించారు. 31 మందిని ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లోతుగెడ్డ తాతబాబు, రెడ్‌క్రాస్ మండల కన్వీనర్ పాగిరి రవి, కమిటీ సభ్యుడు పెద్దిన రామానుజులు తదితరులు పాల్గొన్నారు.

### గోవిందకు సన్మానం


గోవిందను సత్కరిస్తున్న దృశ్యం

పొందూరు: మండల కేంద్రానికి చెందిన కాళ్ల గోవిందను స్థానిక కంచి కామాక్షి ఏకాంబరేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఆ ఆలయం ఆవరణలో తాగునీటి గొట్టపు బావి, విద్యుత్ మోటారు, పైపులైన్ నిర్మాణానికి రూ.82 వేలు మొత్తాన్ని ఆయన అందజేశారు. కార్యక్రమంలో కంచి కామాక్షి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

### దేవీపీఠంలో పూజలు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతీపేటలోని రాజరాజేశ్వరీ మహాత్రిపుర సుందరి దేవీ పీఠంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. జగద్గురు శంకరాచార్య జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న నవ చండీయాగ అంతర్గత చండీహోమం పూర్ణాహుతి జరిగింది. పీఠం నిర్వాహకులు పెంటరామచంద్రశేఖరశర్మ నిర్వహణలో వేదపారాయణలు జరిగాయి

## భక్తిశ్రద్ధలతో హనుమంత వాహన సేవ


హనుమంత వాహనసేవ నిర్వహణ


కోలాట నృత్యం చేస్తున్న మహిళలు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం హనుమంత వాహన సేవ భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఆలయం వద్ద నుంచి స్వామివారిని హనుమంత వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తప్పెటగుళ్లు, కోలాటం, అష్టలక్ష్మిల వేషధారణల్లో మహిళలు అలరించారు. కార్యక్రమంలో అర్చకులు కృష్ణమాచార్యులు, బ్రహ్మోత్సవాల కమిటీ ప్రతినిధులు జోష్యుల జగన్నాథశర్మ, మావుదూరి జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


వేంకటేశ్వరునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న బ్రహ్మోత్సవాల కమిటీ ప్రతినిధులు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండడంతో పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకి అర్చకులు కృష్ణమాచార్యులు స్వాగతం పలికారు. అనంతరం బ్రహ్మోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, సర్పంచ్ బూరల్లి శంకర్, ఆలయ ట్రస్టు ప్రతినిధులు వీరభద్రస్వామి, కృష్ణప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, గుప్త, చీపురు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'వైఎస్సార్‌సీపీదే విజయం'


కర్నేన దీప

బూర్జ: జూన్ 4వ తేదీన రానున్న ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీదే విజయమని ఎంపీపీ కర్నేన దీప దీమా వ్యక్తం చేశారు. మండలంలోని లక్కుపురం గ్రామంలో బుధవారం ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి స్పీకర్ తమ్మినేని సీతారాం భారీ విజయం సాధిస్తారన్నారు. జూన్ 9వ తేదీన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు.

## హర్షవల్లి లయన్స్ క్లబ్‌కు అరుదైన గౌరవం


సమావేశమైన క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: హర్షవల్లి లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సేవలకు మెచ్చిన 316ఏ లయన్స్ ఇంటర్నేషనల్ చైర్మన్‌గా హారికా ప్రసాద్ (కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్), జోనల్ చైర్మన్‌గా ప్రస్తుత అధ్యక్షులు శోభారాణి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం హర్షం వ్యక్తం చేసింది. బుధవారం జరిగిన 2024–25 సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గం ఎన్నిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపిక చేశారు. అధ్యక్షులుగా వావిలపల్లి జగన్నాథం నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ చైర్మన్ హోదాలో హారికా ప్రసాద్ మాట్లాడుతూ.. సేవా రంగంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఒకే క్లబ్‌కు రెండు పదవులు దక్కడం హర్షణీయమన్నారు. ఇందుకు లయన్స్ ఇంటర్నేషనల్ 316ఏ వారికి కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన జోన్ చైర్మన్ కరణం శోభారాణి, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షులుగా వి.జగన్నాథంనాయుడు, కార్యదర్శిగా మణిశర్మ, కోశాధికారిగా లక్ష్మీకాంత్, ఉపాధ్యక్షులుగా తర్లాడ అప్పలనాయడు, పాలిశెట్టి మధుబాబు, కార్యవర్గ సభ్యులుగా కె.ఉషారాణి, చింతాడ శిరీష, ఎ.వెంకునాయుడు, మజ్జి సుమన్ ఎన్నికయ్యారు.

## శ్రీకూర్మనాథాలయంలో 'పండిత గోష్టి'


పండిత గోష్టి నిర్వహిస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మనాథుని కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం పండిత గోష్టి నిర్వహించారు. ఆలయ అనివిశెట్టి మంటపంలోకి స్వామి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వాముల ఉత్సవమూర్తులను వేంచింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పండితులు వేదాలను విన్నపించారు. ఈవో జి.గురునాథం పండితులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, దాసుబాబు, కిశోర్‌బాబు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సేంద్రియ సాగుతో భూసారం


మాట్లాడుతున్న నైర కళాశాల డీన్ భరతలక్ష్మి

శ్రీకాకుళం రూరల్: సేంద్రియ వ్యవసాయం ద్వారా భూసారం పెంపొందించుకోవచ్చని నైర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.భరతలక్ష్మి అన్నారు. బుధవారం వెంకటాపురంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వినియోగించి సాగు చేయడం ద్వారా నాణ్యమైన ఆహారం పొందవచ్చన్నారు. అనంతరం రాగోలు పరిశోధన స్థానం శాస్త్రవేత్త కె.మధుకుమార్ వరి పంట దశలు, కీలకమైన వంగడాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జి.చిట్టిబాబు, జె.జగన్నాథం, సమన్వయకర్తలు బి.జ్యోతిబసు, ఎం.లక్ష్మీదుర్గా, శ్రీపురుషోత్తం, నైరా కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం నైరా కళాశాలలో హాస్టల్ 35వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థి, ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా డివిజనల్ ఫారెస్ట్ అధికారి ప్రతాప్ మాట్లాడుతూ విద్యార్థి దశలో వసతి గృహం కీలకమన్నారు. పూర్వ విద్యార్థి సూరిబాబు మాట్లాడుతూ లక్ష్య సాధనలో వెనుకడుగు వేయకుండా శ్రమించాలన్నారు.

## భూసార పరీక్షలు తప్పనిసరి

రణస్థలం: నేలలోని లభ్య పోషకాలను గుర్తించి అందుకు అనుగుణంగా పంట వేస్తే మంచి దిగుబడులు వస్తాయని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. మండలంలోని కొండములగాం గ్రామానికి చెందిన రెడ్డి చిన్నంనాయుడు పొలంలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనా సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడటం, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేలకు అవసరమైన సూక్ష్మజీవులు చనిపోయి, నేల సారవంతం కోల్పోయి కాలుష్యానికి గురవుతోందన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి చౌడు గుణాలు, ఎక్కువ సున్నం కలిగిన గుణాల్ని తెలుసుకుని తద్వారా ఎరువుల యాజమాన్య పద్ధతులు చేపట్టడం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ వాతావరణ కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా నేలలో సేంద్రియ కర్బన శాతాన్ని పెంచడానికి సుమారు ఆరువేల ఎకరాలకు సరిపడా అపరాల విత్తనాలు, జీవన ఎరువులు, బయోచార్ వంటి సేంద్రియ కర్బన ఎరువులను అందించామని వివరించారు. గత ఏడాది 13 మండలాల్లోని రెండు వేల ఎకరాల్లో మట్టి నమూనాలు సేకరించి హైదరాబాద్‌లో గల అంతర్జాతీయ మెట్ట ప్రాంత పంటల పరిశోధనా సంస్థ(ఇక్రిశాట్) పరిశీలన చేపట్టి సంబంధిత కార్డులను ఉచితంగా రైతులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, సిబ్బంది వై.లహరి, రావాడ కృష్ణ, పిషిణి రమ పాల్గొన్నారు.